క్లుప్తంగా

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి: జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండలంలోని పిరిడి సచివాలయంలో చేస్తున్న రిజిస్ట్రేషన్లను శుక్రవారం పరిశీలించిన ఆయన పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేపట్టాలని తెలిపారు. అనంతరం అదే గ్రామంలోని ఈబీసీ నేస్తం లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు.

11న ఉచిత నేత్రవైద్య శిబిరం

బాడంగి: స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఈ నెల 11వ తేదీన ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగుల నేత్రాలు తనిఖీ చేసి, మందులు అందజేస్తారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స, కళ్లద్దాలు అందేలా చూస్తారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

నేడు ఉపముఖ్యమంత్రి రాక

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామానికి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర శనివారం రానున్నారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం ప్రారంభించడంతో పాటు ఇళ్లపట్టాలు పంపిణీ చేయనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను త్వరగా పూర్తిచేయండి



స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో నిర్మిస్తున్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. శుక్రవారం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. నిర్దేశిత సమయంలోగా నిర్మాణం పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం భోజరాజపురం వద్ద ఉన్న ప్రధాన తాగునీటి వనరుల కేంద్రాన్ని పరిశీలించి, మోటార్ల పనితీరు, ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో నీటి నిల్వలు ఏ మేర ఉన్నాయన్న విషయం అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



బుర్రకథ ప్రదర్శన ద్వారా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రామభద్రపురం: బాల్యవివాహాల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సూర్యకుమారి, పి.కృష్ణకుమారి, డి.కె.రత్నకుమారి అన్నారు. మండల కేంద్రంలోని వసంతుల వీధి రామమందిరం వద్ద బాల్యవివాహాల నిర్మూలన, ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పథకాలపై బుర్రకథ రూపంలో శుక్రవారం అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను బాలికలకు, తల్లిదండ్రులకు తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, కల్పిస్తున్న సదుపాయాలను కళాకారులు గేయాలు, ప్రదర్శనల ద్వారా ప్రజలకు తెలియజేశారు.

నులిపురుగులు.. నులిమేద్దాం..!

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) శుక్రవారం పంపిణీ చేశారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు వయసున్న పిల్లలతో అర్ధమాత్ర, రెండు నుంచి 19 ఏళ్లలోపు వయసున్న వారితో 400 ఎంజీ మాత్రలు మధ్యాహ్న భోజనం తర్వాత వైద్యుల పర్యవేక్షణలో మింగించారు. నులిపురుగులనేవి శరీరంలోని పోషకాలను గ్రహించి, అభివృద్ధి చెందే పరాన్నజీవులని, ఇవి ఉంటే రక్తహీనత, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఇవేవీ లేకుండా ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని వైద్యాధికారులు తెలిపారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ



తెర్లాం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి



బొబ్బిలి: పిరిడి పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రవికుమార్, వైద్యులు



బాడంగి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నోట్లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ రామారావు



రాజాం: పాగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండోజోల్ మాత్రలు మింగిస్తున్న దృశ్యం



రేగిడి: దేవుదళ కేజీబీవీలో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



వంగర కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం సిటీ: బొద్దాం పాఠశాలలో విద్యార్థిని నోట్లో మాత్ర వేస్తున్న ఎంపీడీవో శంకరరావు



సంతకవిటి: హొంజరాంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మంజుల



మెంటాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

భూ సర్వేలోని పొరపాట్లు సరిదిద్దుతాం

- జాయింట్ కలెక్టర్ సి.కె.కార్తీక్

బొబ్బిలి: భూముల రీసర్వేలో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుతామని జాయింట్ కలెక్టర్ సి.కె.కార్తీక్ అన్నారు. స్థానిక పట్టణంలోని ఆర్డీవో, బుడా కార్యాలయాలను శుక్రవారం సందర్శించిన ఆయన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఇటీవల ప్రస్తావించిన రీసర్వే అంశాన్ని గూర్చి కాసేపు మాట్లాడారు. ఎక్కడైనా రీసర్వేలో తప్పులుంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని సరిచేస్తామన్నారు. జగనన్న స్మార్ట్ సిటీల్లో భాగంగా సాలూరులో దరఖాస్తు చేసుకున్న వారికి ప్లాట్లు సిద్ధం చేశామని, త్వరలోనే లాటరీ ద్వారా వాటిని వారికి అందజేస్తామన్నారు. పార్వతీపురం, బొబ్బిలిలో స్థలాల గుర్తింపు ప్రక్రియ జరుగుతోందన్నారు. అనంతరం బొబ్బిలి వీణల కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్, ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని వాసవీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.5.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రోడ్డును త్వరితగతిన పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్, మేనేజర్ ఎంవీ నాగరాజు, పాలవలస శ్యామ్, నల్లా శ్రీనివాసరావు, వాకముల్ల ఉమామహేశ్వరరావు, శాసపు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న పాలవలస శ్రీనివాసరావు

మెనూ తప్పనిసరిగా పాటించాలి

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం అమలులో భాగంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటకాలు చేయడంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఆయన వడ్డించారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, మెనూ పేర్కొన్న ప్రకారం వంటకాలు వండిపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, హెచ్ఎం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

ఆర్‌బీకేల్లో పురుగుమందులు ఉంచాలి

రాజాం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులతో పాటు సీజన్ వారీగా పంటలకు అవసరమైన పురుగుమందులు కూడా విక్రయాలకు సిద్ధం చేయాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు సకాలంలో అందించడంతో పాటు ఖరీఫ్ పంటను సకాలంలో కొనుగోలు చేయడం, రైతులకు బిల్లులు చెల్లించడం వంటివి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అద్భుత పాలనకు నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు మాట్లాడుతూ రైతు సంఘాల ద్వారా అందించే వ్యవసాయ సామగ్రిని రైతులకు వ్యక్తిగతంగా కూడా అందించాలని కోరారు. గ్రామాల్లో పంట మార్పిడి విధానాన్ని రైతులకు రుచి చూపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, ఎంపీడీవో బాసూరి శంకరరావు, వ్యవసాయ శాఖ ఏడీ చంద్రరావు, ఏవో రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మద్దువలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ జనార్దన్

వంగర: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వై.వి.జనార్దన్ హెచ్చరించారు. మండలంలోని మద్దువలస, వంగర, అరసాడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, కనీస సదుపాయాలు ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని గ్రామపెద్దలకు సూచించారు.

విద్యాసామర్థ్యాలు పెంపొందించాలి

వంగర: విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని, విద్యార్థులకు అర్థమయ్యేల పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించి, వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు.

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, వివిధ వసతిగృహాలను జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని సూచించారు.

ఇంటిపన్ను వసూలు చేయండి

రాజాం సిటీ: గ్రామ సచివాలయ పరిధిలో ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కంచరాం సచివాలయంలో వలంటీర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించి, ఇంటిపన్నుల వసూళ్లతో పాటు కులగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

సీఎం జగన్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి



రేగిడి: పెద్దపుర్లి గ్రామస్తులతో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపుర్లి, చిన్నపుర్లి, దేవుదళ, గోపింపేట, ఆడవరం, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అప్పాపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లోని పార్టీ నేతలు, పలు సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువతతో కలిసి, రానున్న ఎన్నికల్లో తనకు, పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ తపన అని, ఆయన దానికోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏవైనా పథకాలు, రుణాలు ఆ పార్టీ వారికే వచ్చేవన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనించాలని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకే మళ్లీ పట్టంగట్టాలని కోరారు. ఎన్నికల వేళ మరోసారి మాయమాటలతో చంద్రబాబు అండ్ కో సిద్ధమయ్యారని, వారి మాటలు నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. పథకాలు పొందిన ప్రతిఒక్కరూ ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ గెలిపించాలని, రాష్ట్రంలో సంక్షేమ పాలనను కొనసాగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్‌కుమార్, సర్పంచ్‌లు కెంబూరి వెంకటేశ్వరరావు, గార రమణ, కరణం శ్రీనివాసరావు, కరణం గోవిందరావు, వావిలపల్లి చంద్రశేఖర్, వియ్యపు చక్రపాణి, కుప్పిలి గవరయ్య, ఎంపీటీసీలు కురిటి రామకోటి, కెంబూరి శ్రీహరినాయుడు, ఎర్నేన అప్పలనాయుడు, రెడ్డి నర్సింగరావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో అందరికీ వైద్యం



రేగిడి: సోమరాజుపేటలో రోగులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది



బాడంగి: మాట్లాడుతున్న ఎంపీడీవో అంజనేయులు



రాజాం సిటీ: నేత్రవైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

రేగిడి: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ వైద్యసేవలు అందుతున్నాయని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.చలమయ్య అన్నారు. మండలంలోని సోమరాజుపేట గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారికి వైద్యారోగ్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు, డాక్టర్ బి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని తెంటువలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు శిబిరాలకు వచ్చి, సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవిరావు, వాడాడ పీహెచ్‌సీ వైద్యుడు వంశీకృష్ణ, కార్యదర్శి బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీవో బాసూరి శంకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని సోపేరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సిద్ధేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరీ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం దగ్గరున్న మండపం వద్ద శుక్రవారం నిర్వహించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ ఆకట్టుకుంది. విజయనగరానికి చెందిన గాత్ర శిరోమణి బిరుదాంకితులు తాళాబత్తుల అమ్మాజీ చేసిన గీతాలాపన శ్రోతలకు వీనులవిందు చేసింది. అనంతరం పట్టణవాసులు ఆమెను సత్కరించారు.



గీతాలాపన చేస్తున్న అమ్మాజీ